

సౌకర్యాలు కల్పించాలి 8లో▸

అకాల వర్షాల నేపథ్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ అధికారులకు సూచించారు.



చెరువు మట్టితో ప్రయోజనం

చెరువులోని ఒండ్రు మట్టిని రైతులు పొలాల్లో వేసుకుంటున్నారు. దీంతో రసాయన ఎరువుల వినియోగం, పెట్టుబడులు తగ్గి పంట దిగుబడులు పెరుగుతున్నాయి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /23.6

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమ పెరుగుతుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రాజమణి అన్నారు. ఇటీవల కర్ణాటకలో అంగన్‌వాడీలు చేసిన ఉద్యమంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తిస్తామని గ్రాడ్యుటీ చెల్లిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా గ్రాడ్యుటీ అమలు చేయాలని జిల్లా పీడీ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోషకాహార అందరికీ అందజేసి సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు కార్మి కులే అని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 45, 46 సమావేశాల్లో తీర్మానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, జిల్లా కార్యదర్శులు లలిత, శైలజ, సహాయ కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం పోరాటం



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

సారంగపూర్: కనీస వేతనాల కోసం, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపు కోసం ఐఎఫ్‌టీయూ పోరాటం చేస్తుందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామలక్ష్మణ్, బక్కన్న తెలిపారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలో 183వ మే డే పోస్టర్లను గురువారం విడుదల చేశారు. కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులు సమ్మె చేసే హక్కును కాలరాస్తుందని ఆరోపించారు. కార్మికుల పని గంటలు పెంచి శ్రమ దోపిడీకి పాల్పడుతూ యాజమాన్యాలు లాభాలు ఆర్జిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం, యాజమాన్యాలపై పోరుకు కార్మికులు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో సాయన్న, ప్రవీణ్, శ్యామల, లింగం, తదితరులు పాల్గొన్నారు.

మక్కలు కొనాలని వినతి



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,960తో మక్కలు కొనాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యం రెడ్డి, ఏలేటి లింగారెడ్డి కోరారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టం అంచనా వేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో పార్లమెంటు కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసిమ్మె రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలుమంగ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమారవెని నర్సాగౌడ్, మండల అధ్యక్షుడు సోన్నపేట గంగారెడ్డి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్కల కొనుగోలుకు ప్రభుత్వం పచ్చజెండా

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు యాసంగిలో పండించిన మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. రైతులు తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. మక్కలు కొనాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు విన్నవించగా, కేసీఆర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

మక్కలు కొనాలని సీఎంకు వినతి

భైంసాటౌన్: బహిరంగ మార్కెట్‌లో మక్కల ధరలు తగ్గుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి కొనుగోలు చేయాలని పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో విన్నవించారు. స్పందించిన సీఎం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో మాట్లాడి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మామిడి రైతుకు అకాల నష్టం



ఈచిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బీర్పూరి లచ్చన్న. కడెం మండలంలోని కల్లెడ గ్రామంలో ఈయనకు రెండున్నర ఎకరాల మామిడి తోట ఉంది. ఈసారి కాత అంతంతమాత్రంగానే ఉంది. ఉన్న కాయలతో కొంతైనా ఆదాయం వస్తుందని భావించాడు. నాలుగైదు రోజుల్లో తెంపుదామని భావించాడు. అయితే ఈనెల 21న కురిసిన వడగండ్ల వానకు కోతకు వచ్చిన కాయలన్నీ నేల రాలాయి. దీంతో మనస్తాపం చెందిన లచ్చన్న ఈనెల 24న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



- వడగండ్ల వానతో తీవ్ర నష్టం
- చేతికొచ్చిన కాయలు నేలపాలు
- రాలిన కాయలకు ధర పతనం
- పరిహారం కోసం ఎదురుచూపు

ఖానాపూర్/కడెం: జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వడగండ్ల వాన మామిడి రైతులను నిండా ముంచింది. భారీ ఈదురుగాలులు, వర్షాలకు కోతకు వచ్చిన మామిడికాయలు నేలరాలాయి. పది రోజుల వ్యవధిలో నాలుగుసార్లు కురిసిన వర్షాలకు జిల్లాలోని వందలాది ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మామిడి కొమ్మలు విరిగిపోవడంతోపాటు కాయలు నేలరాలాయి. తోటలకు వెళ్లిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రాలిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులు రూపాయికో కాయ ఇవ్వమని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో 671 ఎకరాల్లో నష్టం..

జిల్లాలో 2,744 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు 671 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయి. 486 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖానాపూర్‌లో 185 ఎకరాల్లో తోటలు దెబ్బతినగా 142 మంది రైతులు, కడెంలో 364 ఎకరాల్లో 286 మంది రైతులు, దస్తురాబాద్‌లో 86 ఎకరాల్లో 36 మంది రైతులు, పెంబిలో 36 ఎకరాల్లో 22 మంది రైతులకు చెందిన మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ఉద్యానవన శాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి సైతం నష్టం భారీగానే జరిగింది. పంట నష్టం అంచనా వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ఏఈవోలు సర్వే చేస్తున్నారు.



నేలరాలిన మామిడి కాయలు

ఆర్ఎస్ఎస్‌లో నమోదుతో..

రైతులు పంటసాగు సమయంలో అధికారులు చేపట్టే రైతు సమగ్ర సమాచారం వివరాల్లో ప్రస్తుత పంటను నమోదు చేస్తేనే పూర్తిస్థాయి లబ్ధి జరిగే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కొంతమంది రైతులు అది తెలియక ప్రస్తుతం సాగులో ఉన్న పంటకు బదులు వేరే పంటను నమోదు చేయడం ద్వారా పరిహారం వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. కాగా, పంట నష్టం కనీసం 33 శాతం ఉంటేనే పరిహారం వస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మేరకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తే నష్టం పూడ్చలేమని, ఎకరాలకు కనీసం రూ.30వేల పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రూ.8 లక్షల నష్టం..



ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి ఎనిమి ది ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలా యి. కాయలు తెంపుదామనుకున్న సమయంలో కురిసిన అకాల వర్షం నిండా ముంచింది. సుమారు రూ.8 లక్షల నష్టం జరిగింది.

– కొండ ప్రవీణ్, రైతు, దస్తురాబాద్.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఇటీవల కురిసిన వడగండ్ల వానకు మూడు ఎకరాల మామిడి తోటలో కాయలన్నీ నేల రాలాయి. రూ.3 లక్షల నష్టం జరిగింది. గతంలో కూడా పంట నష్టం జరిగినపుడు అధికారులు సర్వే చేసి పరిహారం అందలేదు. ఈసారైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– గంట శ్రీనివాస్, రైతు, కల్లెడ, కడెం మండలం

సర్వే చేశాం

జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఖానాపూర్, కడెం మండలాల పరిధిలో నష్టం ఎక్కువగా ఉంది. నష్టంపై ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక సర్వే చేపట్టాం. నివేదికను ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వానికి పంపుతాం.

– రాథోడ్ శ్యాంరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

వాసవీ మాతకు విశేషాలంకరణ



ఖానాపూర్ పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆరో రోజు గురువారం అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. పత్తితో చేసిన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు అభిషేక్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు జితేందర్, సభ్యులు, భక్తులు ఉన్నారు. - ఖానాపూర్

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

కడెం: ఇటీవల వర్షాలు, ఈదురుగాలులకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సర్దార్, సీపీఐ(ఎంఎల్)నాయకుడు రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గంగాధర్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

భైంసాటౌన్: ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని ఆర్ఎం జానిరెడ్డి అన్నారు. గురువారం భైంసాలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రయాణికుల సంఖ్య పెంచేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డీఎం అమృత, సిబ్బంది ఉన్నారు.

బాబోయ్.. దొంగలు..!



ఓ ఇంట్లో దొంగలు చిందరవందరగా పడేసిన వస్తువులు

- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

భైంసాటౌన్: బాసరలో వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. అర్ధరాత్రి వేళ తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలు మారణాయుధాలతో వచ్చి బెదిరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి నాలుగిళ్లలో చోరీకి పాల్పడి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. మండలంలోని కిర్గుల్(బి)లో బుధవారం అర్ధరాత్రి మరో నాలుగు ఇళ్లను దోచేశారు. వరుస చోరీలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ పెంచి చోరీలు అరికట్టాలని కోరుతున్నారు.

'మహా' ముఠాల పనేనా..

బాసర మండలం మహారాష్ట్రకు సరిహద్దున ఉండడంతో వరుస దొంగతనాలు కూడా అక్కడి దొంగల పనే అయి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. గతంలో బాసర మండలకేంద్రంలో పర్ధనీ ముఠా ఓ కుటుంబంలో ముగ్గురిని దారుణంగా హత్య చేసి ఇంట్లోని అమ్మవారి విగ్రహం, బంగారు నగలు ఎత్తుకెళ్లింది. అలాగే రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ఓ దాబాలో పనిచేసే వ్యక్తి దాబా యజమానితోపాటు అతని కొడుకును దారుణంగా హత్య చేసిన ఉదంతం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ ఘటనలు ఇప్పటికీ బాసర వాసులను కలవరపెడుతున్నాయి. తాజాగా వరుస చోరీలు మండల వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

గస్తీ పెంచాలి...

బాసరలో వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా బాసర రైల్వేస్టేషన్ ప్రాంతంలో నిఘా పెంచాల్సిన అవసరముంది. మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అనుమానితులు రైలుమార్గంలో బాసర చేరుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి నిఘా పెట్టాలని కోరుతున్నారు. గ్రామాల్లో సైతం రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలంటున్నారు.

త్వరలో పట్టుకుంటాం..

బాసర మండలకేంద్రంతోపాటు కిర్గుల్(బి) గ్రామంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాం. దొంగల కోసం గాలిస్తున్నాం. త్వరలోనే పట్టుకుంటాం. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వాలి.

– మహేశ్, ఎస్సై, బాసర

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



లోకేశ్వరంలో సంఘీభావం తెలుపుతున్న రమాదేవి

లోకేశ్వరం: ఐకేపీలో వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు. లోకేశ్వరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న వీవోఏలకు రమాదేవి గురువారం సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఐడీ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల సాధారణ బీమా, హెల్త్‌కార్డులు ఇవ్వాలని సూచించారు. అర్హులైన వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంటేనోల్ల గంగాధర్, వీవోఏలు సంగీత, గంగాధర్, రాధ, శ్రీనివాస్, తిరుమల, అనిత, గంగన్న, సునీత, లక్ష్మణ్, రాజు, శైలజ, మధురాణి, అన్నపూర్ణ, దివ్య, మల్లేశ్, సాయన్న, రాములు, నారాయణ, పోశెట్టి, లత పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

భైంసాటౌన్: ఐకేపీ వీవోఏలపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలని, వారి సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు. బాసర మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న వీవోఏలకు గురువారం మద్దతు తెలిపారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూషణ్, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నర్సింగరావు, సుభాష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'పీఎంశ్రీ'కి 17 పాఠశాలలు ఎంపిక

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. పీఎంశ్రీ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి జిల్లాలో 17 పాఠశాలలను ఎంపిక చేసింది. ఒక్కో పాఠశాలను రూ.40 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ముధోల్ మండలం టీఎస్‌డబ్ల్యూఆర్ఐ బాలుర పాఠశాల, జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ పాఠశాల, ఈద్‌గాం ఉన్నత పాఠశాల, బాసర ఉన్నత పాఠశాల, భైంసా ఓవైసీనగర్‌లోని ఆశ్రమ పాఠశాల, దేగామ జిల్లా పరిషత్ పాఠశాల, దస్తురాబాద్ కేజీబీవీ, కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ ఉన్నత పాఠశాల, లక్ష్మణచందా జిల్లా పరిషత్ పాఠశాల, మామడ మండలం కొర్టికల్ జెడ్పీహెచ్ఎస్, దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల, ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్, కుభీర్ ఆశ్రమ పాఠశాల, కుంటాల మోడల్ స్కూల్, సారంగాపూర్ మండలం జామ్, సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 70 పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా 67 పాఠశాలలకు అర్హత ఉన్నట్లు గతంలో అధికారులు నివేదిక అందించారు. ఆ దరఖాస్తులను వడపోసి 17 పాఠశాలలను ఎంపిక చేశారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్ రూరల్: విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధి కోసమే సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఎం.రాంబాబు తెలిపారు. సమ్మర్ క్యాంపులకు సంబంధించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, వలంటీర్లు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 115 పాఠశాలల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 107 గ్రామ పంచాయతీల పరిధిలో, 16 అర్బన్ పరిధిలోని పాఠశాలల్లో ఏర్పాటు చేశామని వివరించారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ శిబిరాలు ఉపయోగించుకోవాలని సూచించారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ శిబిరాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, వలంటీర్లు విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. జెడ్పీ సీఈవో సుధీర్ మాట్లాడుతూ ఈ వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యం పెరుగుతాయని పేర్కొన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వివిధ క్రీడలు నేర్పడం, ఆడించడం, ఆంగ్లం, గణితం, విజ్ఞానశాస్త్ర అంశాలు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు బోధించడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం ఎల్టా రూపొందించిన ఆంగ్ల పుస్తకాన్ని అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేష్‌కుమార్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు భూక్య రమేశ్, కార్యదర్శి భోజన్న, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమణారావు, డీఎస్‌వో వినోద్ కుమార్, విషయ నిపుణులు నారాయణవర్మ, కూన రమేశ్, మనోహర్‌రెడ్డి, ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు ప్రవీణ్‌కుమార్, నర్సయ్య, హెచ్ఎం శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఉచిత నృత్య శిక్షణ ప్రారంభం



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించిన డాన్స్ అకాడమీ డైరెక్టర్

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్‌లో వెన్నెల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత నృత్య శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా నృత్య శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మరో ఉచిత శిక్షణ శిబిరా న్ని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణ శిబిరానికి సంబంధించి మరిన్ని వివరాలకు 9951993450 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, గంధం సుధాకర్ ఉన్నారు.



బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శ్రీభగీరథ మహర్షి జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాంబాబు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో లోకేష్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, బీసీ అభివృద్ధి శాఖ, వసతిగృహ అధికారులు పాల్గొన్నారు. - నిర్మల్‌చైన్‌గేట్

క్లుప్తంగా

రేపు మెడికోలకు స్కాలర్‌షిప్‌లు

ఆదిలాబాద్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈనెల 29న రిమ్స్‌లో 25మంది మెడికోలకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అశోక్, శ్యామ్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ రావ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఐఎంఏ ఆధ్వర్యంలో మెడికోలకు స్కాలర్‌షిప్‌లు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

బాసరలో దొంగల భయం

భైంసాటౌన్: బాసర మండలంలో గుర్తు తెలియని దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుసగా రెండోరోజూ నాలుగిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. కిర్గుల్(బి) గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఎస్సై మహేశ్ వివరాల ప్రకారం.. కరాండె కపిల్, గౌతం, శ్రీపాల్‌లు పక్కపక్క ఇళ్లల్లో ఉంటున్నారు. రాత్రి ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో పడుకోగా గుర్తు తెలియని దొంగలు తాళం పగలగొట్టి రూ.2.54లక్షల విలువైన బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే షేక్ మెయిన్ ఇంట్లో రూ.90వేల విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిర్యాదు చేసిన 24గంటల్లో ఫోన్ స్వాధీనం



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి పట్టణ టూ టౌన్ పోలీసులు ఫిర్యాదు చేసిన 24గంటల్లోనే అప్పగించారు. స్థానిక సంజయ్ నగర్ కాలనీకి చెందిన ఎస్‌కే యూసుఫ్ ఈ నెల 7వ తేదీన తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. 26వ తేదీన టూ టౌన్ పోలీస్‌స్టేషన్లో నూతనంగా కేంద్ర టెలికాం, పోలీస్ ద్వారా సంయుక్తంగా ఏర్పాటు చేసిన సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేశాడు. 27వ తేదీన ఓ వ్యక్తి వద్ద ఫోను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితుడికి డీఎస్పీ ఉమేందర్, టూ టౌన్ సీఐ పురుషోత్తం అప్పగించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు నూతన సిస్టం ప్రారంభించిన వారంలోనే 5 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీసీటీఎన్ఎస్ రైటర్ శరత్ పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ గురువారం తీర్పు నిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం... మామడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018 మే 11న యువతి ఇంట్లో ఒంటరిగా ఉండగా అసభ్యకరంగా ప్రవర్తించిన మేకల శేఖర్ అలియాస్ రాజశేఖర్‌పై కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రాంనర్సింహారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోక్సో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు నిచ్చారు.

శివాజీ చౌక్‌లో



బస్టాండ్ ప్రాంతంలో



పాత బస్టాండ్ ఏరియాలో ప్రమాదకరంగా హోర్డింగ్





ప్రమాదకరంగా హోర్డింగ్‌లు

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇటీవల భారీగా గాలులతో కూడిన వర్షం కురువడంతో హోర్డింగ్‌లు ప్రమాదాలకు నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. గతంలో హోర్డింగ్‌లు విద్యుత్ తీగలపై పడిన సందర్భాలు అనేకమున్నాయి. ప్రస్తుతం మళ్లీ ఈదురుగాలుల సీజన్ మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లపై ఉన్న ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై చిరిగిపోయి పడుతుండడంతో ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం పరిశీలిస్తున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

భైంసాటౌన్: అకాల వర్షాల నేపథ్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్‌వో తనూజతో కలిసి గురువారం భైంసాకు వచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో రైస్‌మిల్లర్లు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మిర్చి మార్కెట్ యార్డులోని గోదాంలో నిల్వ ఉంచిన గన్నీ సంచులను పరిశీలించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 30 లక్షల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. రైస్‌మిల్లుల నుంచి వచ్చే ప్రతీ బియ్యం సంచిని పరిశీలించాలని సూచించారు. నాణ్యత లేని వాటిని వెంటనే తిరిగి పంపాలన్నారు. కాసేపు హమాలీలతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన బియ్యం అందించాలి

లోకేశ్వరం: రేషన్ షాపులకు నాణ్యమైన బియ్యం అందించాలని తెలంగాణ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ సూచించారు. మండలంలోని సేవాలాల్ తండాలోని రైస్‌మిల్‌ను గురువారం తనిఖీ చేశారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం ఎలాంటి షరతులు లేకుండా తీ సుకోవాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్‌వో తనూజ, డీఎం శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: పాలియేటీవ్ కేర్‌లో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్ అన్నారు. గురువారం రిమ్స్‌లోని పాలియేటీవ్ కేర్ సెంటర్‌ను సందర్శించారు. రోగులకు అందుతున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి పాలియేటీవ్ కేర్‌లో చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ నెలలో 26 మంది అవుట్ పేషెంట్లను, 27మంది ఇన్‌పేషెంట్లకు మొత్తం 167 మంది క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించడం జరిగిందని పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.

మళ్లీ అదే వ్యథ..!





ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్నా.. ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రి సిబ్బంది తీరు మారడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులను సంబంధిత వార్డులకు తీసుకెళ్లాల్సిన పేషెంట్ కేర్ సహాయకులు పత్తా లేకుండా పోయారు. గురువారం అనారోగ్యంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చిన రోగిని ఆమె కుటుంబీకులే ఎమర్జెన్సీ వద్ద స్ట్రెచర్ తీసుకువచ్చి లోనికి తీసుకెళ్లింది. దృశ్యం రిమ్స్‌లో నెలకొన్న రోగుల అవస్థలకు నిదర్శనంగా నిలుస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మొక్కజొన్న రైతుల స్వీయ నిర్బంధం



పంచాయతీ భవనంలో స్వీయ నిర్బంధంలో రైతులు

బోథ్: మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతులు గ్రామపంచాయతీలో గురువారం స్వీయ నిర్బంధనం చేసుకున్నారు. గ్రామపంచాయతీ గది లోపల నుంచి తాళం వేసుకున్నారు. ప్రభుత్వం పంట కొనుగోలు చేసినంత వరకు తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని తెలిసి చెప్పారు. దాదాపు నాలుగు గంటల పాటు నిర్బంధంలోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రవీందర్ రైతులతో మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లకు అనుమతినిచ్చిందని తెలిపారు. దీంతో రైతులు పంచాయతీ భవనం గది నుండి బయటకు వచ్చారు.

సాయి పారాయణం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం సాయిపారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ ఆకోజి కిషన్ ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పూజారి సురేష్ ఆచారి, రమణ ,సుభాష్ ,అశోక్, ప్రకాష్ గౌడ్ రామోజీ రమణ పాల్గొన్నారు.

కుంటాలలో...

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో రెండో షిర్డీగా ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

పిడుగుపాటుకు ఇంటి పైకప్పు ధ్వంసం

కుంటాల: మండల కేంద్రంలో గురువారం ఉదయం ఓడ్నం గంగాధర్ ఇంటి స్లాబ్‌పై పిడుగుపడడంతో పైకప్పు దెబ్బతింది. మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షంతో మొక్కజొన్న తడిసిపోగా నువ్వు పంట నెలకొరిగింది. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ విజయ్ పరిశీలించి వివరాలు సేకరించారు.

కుక్కల దాడిలో పశువు మృతి

బోథ్: మండలంలోని మర్లపల్లి గ్రామంలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా రెండు రోజుల క్రితం ఓ పశువుపై దాడిచేయగా మృత్యువాత పడింది. మరో పశువుపై దాడి చేయగా పశు వైద్యాధికారులు చికిత్స అందించారు. కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరో నిందితుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఘర్షణలకు పాల్పడిన మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన షేక్ అయాన్ పరారీలో ఉండగా గురువారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) గ్రామ శివారులోని శ్మశాన వాటిక దగ్గర పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు స్పెషల్ పోలీసు బృందం దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3620 నగదు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాకాల గీత పేర్కొన్నారు.

ఛార్‌ధామ్ యాత్రికులకు ప్రత్యేక ఏర్పాట్లు

- ఎంపీ సోయం బాపురావు



ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: జిల్లా నుంచి ఛార్ ధామ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి గురువారం ఛార్‌ధామ్ యాత్రకు బయలుదేరిన 40 మంది యాత్రికుల ప్రత్యేక బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ ఛార్ ధామ్ యాత్రను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక హెల్ప్ లైన్ కౌంటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మఠాధిపతి శ్రీశ్రీ శ్రీ యోగానంద సరస్వతి స్వామి, నాయకులు రత్నాకర్ రెడ్డి, సునంద రెడ్డి, ముకుంద్ రావు, చిల్కూరి జ్యోతి రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



లోకేష్‌రెడ్డి(ఫైల్)



లోకేష్‌రెడ్డి మృతదేహం

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన లోకేష్‌రెడ్డి(25) గురువారం సాయంత్రం ఈదురుగాలులకు తెగిపడిన త్రీఫేజ్ విద్యుత్ తీగ తగిలి పంటపొలంలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం ఈదురుగాలులు, మెరుపులు, పిడుగులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. ఈదురుగాలులతో లోకేష్‌రెడ్డి పంటపొలంలో బోరుబావి మోటారుకు అమర్చిన త్రీఫేజ్ విద్యుత్ వైరు తెగిపడింది. రోజువారి పనుల్లో భాగంగా గాలివాన తగ్గిన తర్వాత పశువులకు పచ్చిగడ్డి కోసుకురావడానికి తన పంటపొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో తెగిపడిన విద్యుత్ వైరును గమనించని లోకేష్‌రెడ్డి దానిపై అడుగు వేయడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడాది క్రితమే డిగ్రీ పూర్తి చేసిన లోకేష్‌రెడ్డి తండ్రికి చేదోడువాదోడుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. దీంతో కుటుంబీకుల రోదనలు అక్కడి వారిని కంటతడిపెట్టించాయి.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బూర్గుపల్లి(జి) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... జాదవ్ బాలు(36) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అప్పులు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. భార్య జ్యోతి మూడు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందుతాగాడు. గమనించిన స్థానికులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గీత తెలిపారు. బాలుకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన తాటికొండ వినోద్(28) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వినోద్ బండలఖానాపూర్ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామం సమీపంలో అటవీప్రాంతంలో పశువుల కాపరి రాజుకు గురువారం గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వినోద్ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వినోద్‌కు మెడకు గాయాలు ఉండడంతో ఎవరైన హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నిర్మల్‌టౌన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. సీఐ మల్లేశ్ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన తోట రవికుమార్ (36) మార్చి 16న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక ధర్మసాగర్ చెరువులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. సాయంత్రం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే చీకటి పడడంతో గురువారం ఉదయం గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశాడు. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.

ఫౌంటేన్ కాదు.. పైప్‌లైన్ పగిలింది





నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట గురువారం రాత్రి మున్సిపల్ వాటర్ పైప్ లైన్ పగిలిపోవడంతో ఫౌంటెన్‌ను తలపించింది. రోడ్డుపై వృథాగా నీరు పోతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం స్పందించకపోవడం కొసమెరుపు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రోడ్డు ఇలా... వెళ్లేదెలా..?



నిర్మల్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని నిర్మల్ రూరల్ మండలంలోని అక్కపూర్ గ్రామానికి వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పడి రాత్రి వేళలో అక్కపూర్ మీదుగా లక్ష్మణ్‌చందా, సోన్ మండలాకు వెళ్లే గ్రామస్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

